క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని గట్టమ్మ ఆలయ అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఆదివాసీ నాయకపోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం గట్టమ్మ తల్లిని దర్శించుకున్న దేవాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్, ఫారెస్టు రేంజ్ అధికారి శంకర్‌ను గట్టమ్మ ఆలయ పూజారులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాతల కాలం నుంచి గట్టమ్మతల్లి ఆలయ పూజారులుగా నాయకపోడ్‌లు కొనసాగుతున్నారని తెలిపారు. దేవాలయ అభివృద్ధి పనులకు ఫారెస్టు అధికారులు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని గట్టమ్మ ఆలయ పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని అన్నారు. గట్టమ్మ ఆలయం వెనుక భాగంలో ఉన్న కెనాల్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూజారులు కొత్త సదయ్య, అరిగెల సమ్మయ్య, లక్ష్మయ్య, రాజు, రాజేందర్, పుల్లయ్య, చంద్రయ్య, రవి, స్వామి, శివ, సంతోష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సమావేశం

మంగపేట: మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో రేపు(బుధవారం) రైతు భరోసా పథకంపై సలహాలు స్వీకరించేదుకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సంఘ గౌరవ సభ్యులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



వాజేడు: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం నాగారం ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి చాట్ల ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు ఇరుప బాలాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పంట భూముల్లో ప్రహరీల నిర్మాణం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో వ్యవసాయ భూములకు వెంచర్ల పేరులో ప్రహరీలు నిర్మించడంతో పక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రవీదర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంతో పాటు జంగాలపల్లి, వెంకటాపురం గ్రామాల్లో గోడల నిర్మాణంతో చెరువు నీరు అందే కాల్వలు పూడుకపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంట కాల్వలను పునరుద్ధరించి రైతులును ఆదుకోవాలని అన్నారు. అనుమతులు లేకుండా వ్యవసాయ భూములకు ప్రహరీలు నిర్మిస్తున్న వ్యాపారులపై చర్య తీసుకోవాలని అన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలో విద్య వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ (ఏబీవీపీ) గుజ్జుల ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యాశాఖ నిర్వీర్యమైందని ఆరోపించారు. గడిచిన ప్రభుత్వాలు మారినా విద్యార్థుల బతుకులు మారలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందడం లేదని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవితేజ, కృష్ణ, సుశాంత్, శశి, సన్నీ, రంజిత్, నరేష్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక



భూపాలపల్లి అర్బన్: టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు బత్తుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 50మంది కార్మికులు సోమవారం ఐఎన్‌టీయూసీలో చేరినట్లు సంఘం యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య తెలిపారు. యూనియన్ కార్యాలయంలో చేరిక కార్యక్రమాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. యూనియన్‌లో చేరిని వారికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కండువాలు కప్పి ఆహ్వానించారు.

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు



గొత్తికొయలతో మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్



పస్రాలోని గుండ్ల వాగును పరిశీలిస్తున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని పస్రా ఎస్సై కమలాకర్ హెచ్చరించారు. మండల పరిధిలోని మచ్చాపూర్ గొత్తికోయగూడెంను సోమవారం ఆయన సందర్శించారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే తమకు సమాచారం అందించాలని తెలిపారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న వానాకాలం దృష్ట్యా వరదలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మండల పరిధిలో ఉధృతంగా ప్రవహించే గుండ్ల వాగు, దయ్యాలవాగు వరదలపై పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షాలకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పస్రా పరిధిలోని గుండ్ల వాగు, దయ్యాల వాగు బ్రిడ్జిలను సిబ్బందితో కలిసి ఎస్సై పరిశీలించారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని వరదలపై ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న డీఏఓ విజయ్ చంద్ర

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతుభరోసా పథకంలో భాగంగా రైతుల అభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని ఇంచర్ల రైతు వేదికలో వ్యవసాయ శాఖ మండల అధికారి మునుకుంట్ల సంతోష్ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.10 ఎకరాల వరకు రైతు భరోసా వర్తింపజేయాలని అధిక మొత్తంలో రైతులు తెలిపారని వివరించారు. సాగులో లేని భూములకు రైతు భరోసా నిలిపి వేయాలని రైతులు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చిక్కుల రాములు, రైతులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం అందజేత

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో నిత్య అన్నదాన నిర్వహణకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, ధనలక్ష్మి దంపతులు రూ.25,000 చెక్కును ఆలయ రికార్డు అసిస్టెంట్ గోనె లక్ష్మీనారాయణకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు లక్ష్మీనర్సింహాస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హేమాచలుడిని దర్శించుకున్న ధీరత్‌సింగ్

మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామిని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు ధీరత్ సింగ్ ఐఆర్ఎస్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆయన కుటుంబ సభ్యుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందచేసి స్వామివారి ఫొటోను బహూకరించారు.



చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు

ఇసుక లారీ డ్రైవర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న లారీ డ్రైవర్లు

మంగపేట: మండలంలోని రాజుపేటలో ఏటూరు నాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై ఇసుక క్వారీలో లోడింగ్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వందలాది లారీల డ్రైవర్లు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లు మాట్లాడారు. మండలంలోని రాజుపేట, కత్తిగూడెం ఇసుక క్వారీల నుంచి ఇసుకను లోడింగ్ కోసం సుమారు 200 లారీలు గత ఐదు రోజుల క్రితం వచ్చామని వాపోయారు. వర్షం కారణంగా రోడ్లు బురదమయంగా మారాయని లారీలు వెళ్లడం వీలుకాదని చెపుతూ ప్రతి రోజు రేపు లోడింగ్ చేస్తామని చెపుతూ ఐదు రోజులుగా ఇదే సమాధానం చెపుతున్నారని వాపోయారు. గ్రామంలో రోడ్డు పక్కన లారీలు నిలిపితే స్థానికులు అద్దాలు పగలగొట్టేందుకు వస్తున్నారని వాపోయారు. తమ లారీలు నిలిపేందుకు స్థలం చూపించాల్సిన క్వారీ నిర్వాహకులు రాజుపేట శివారు నుంచి జిల్లా సరిహద్దు గ్రామం బ్రాహ్మణపల్లి వరకు నిలుపుకోవాలని సమాధానం చెప్పడంతో రెండు కిలోమీటర్ల మేర లారీలు నిలిపామన్నారు. లారీలను రోడ్డుపై నిలపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. లోడింగ్‌కు వీలు లేకుంటే మరో క్వారీకి ట్రాన్స్‌ఫర్ పెట్టాల్సిన టీజీ ఎండీసీ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదని ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయడం లేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి తమసమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వానికి డీడీ డబ్బులు చెల్లించి క్వారీలోకి వచ్చిన ప్రతి లారీ నుంచి క్వారీ నిర్వాహకులు లోడింగ్ చార్జీ పేరుతో రూ.3500, పొక్లెయినర్ ఆపరేటర్‌కు రూ.500, సీరియల్, సూపర్‌వైజర్లు, గ్రామపంచాయతీ రుసుము, పట్టా కట్టేందుకు రూ.900 ఇలా అదనంగా చెల్లిస్తున్నామని వారు ఆరోపించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



పస్రాలో సాయం అందజేస్తున్న నాయకులు



కన్నాయిగూడెం: పరామర్శిస్తున్న నాయకులు

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గ్రామానికి చెందిన ఎర్రవెల్లి శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పరామర్శించి రూ.20 వేల నగదును ఆర్థికసాయంగా అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి మాట్లాడుతూ.. శంకరయ్య మృతి బాధకారమని బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, రాజేష్, మల్లారెడ్డి, నాగరాజు, అంబాల పోషాలు, మురళి, సూర్యనారయణ, పల్లపు రాజు, ఆది రెడ్డి, ధర్మారెడ్డి, బ్రహ్మచారి, కొండయ్య, ఐలయ్య, మోహన్ రెడ్డి, బుర్ర శ్రీను, అశోక్, గణేష్, రాజేశ్వరి, శారద, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూర్‌గ్రామానికి చెందిన కుమ్మరి మల్లయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు కార్యకర్తలతో కలిసి పరామర్శించి ఆర్థిక సాయం, వంటసరుకులు అందించారు. మల్లయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు తాటి రాజబాబు, తాటి లచ్చలు, చంటి, కుమ్మరి అంజివబాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

చేయూత



హెచ్‌ఎంకు నగదు అందజేస్తున్న దాతలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మౌలిక సౌకర్యాల కోసం సూర్య ప్రకాశరావు కుటుంబ సభ్యులు చేయూతను అందించారు. సోమవారం సూర్య ప్రకాశరావు వర్ధంతి సందర్భంగా పాఠశాల అవసరాల కోసం ఆయన కుటుంబ సభ్యులు రూ.పదివేల నూటపదహర్లను పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అత్మకూరి పట్టాభి, గుడవర్తి నర్సింహమూర్తి, లక్ష్మీనారాయణ, కూసం సాంబశివరావు, చలమయ్య, శ్రీనివాసరావు, రామకృష్ణ, వివేక్, గణేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

సీఐ, ఎస్సైలకు సన్మానం



సీఐని సన్మానిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్‌లను సోమవారం ఓడ బలిజ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గార ఆనంద్, నాయకులు గార పోశాలు, బోటా రమణయ్య, గార మహేష్, బొల్లె పెద్దన్న, తోట నాగేశ్వరరావు, బొల్లె లచ్చబాబు, తోట మహేష్, వంగాల వీరన్న, రవి, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

వాజేడు: పేరూరు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గుర్రం కృష్ణప్రసాద్‌ను మండల కాంగ్రెస్ నాయకులు, జెడ్పీటీసీ తల్లడి పుష్పలత సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాద్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, మండల మాజీ అధ్యక్షుడు దాట్ల వాసు, సొసైటీ ఉపాధ్యక్షుడు జగన్నాథరాజు, మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, నర్సింహరావుతో పాటు తదితరులు ఉన్నారు.

ఎస్సైని సన్మానించిన ఆటో డ్రైవర్లు



ఎస్సైని సన్మానిస్తున్న ఆటోడ్రైవర్లు

వాజేడు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రుద్రారపు హరీష్‌ను మండల ఆటో డ్రైవర్లు సోమవారం మర్యాద పూర్వకంగా సన్మానించారు. శ్రీను, హుస్సేన్, నాగబాబు, ముడిగె శివ, తిలక్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

వెంకటాపురం(ఎం): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆవును మేత కోసం గ్రామ శివారులో వదిలిపెట్టినట్లు పేర్కొన్నారు. ఆవు ఇంటికి తిరిగి రాకపోవడంతో వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెంది ఉందని వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు ఆవు తగిలి షాక్ గురై మృతి చెందిందని రాజు తెలిపారు. ఆవు విలువ రూ.60వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. పశు వైద్యాధికారులు సంఘటన స్థలానికి చేరకొని పంచానామా నిర్వహించారు.



మృతి చెందిన ఆవు

డీఎస్ కాంగ్రెస్‌కు చేసిన సేవలు మరువలేనివి

- మంత్రి సీతక్క



డీఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, రాష్ట్ర ఫైనాన్స్ చైర్మన్ రాజయ్య

ఖలీల్‌వాడి: సీనియర్ నాయకుడు ధర్మపురి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మర్చిపోలేనివని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి సీతక్క అన్నారు. నిజామాబాద్ నగరం ప్రగతినగర్‌లోని డీఎస్ నివాసంలో డీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె నివాళులు అర్పించారు. అనంతరం మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌ను పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ డీఎస్ రెండు సార్లు పీసీసీ అధ్యక్షుడిగా ఉండి కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేశాడన్నారు. డీఎస్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటని చెప్పారు. డీఎస్ ఆశయాలను నేరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లు అని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య అన్నారు. మంత్రి సీతక్కతో కలిసి డీఎస్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు.

'సమాచారం మాకు.. బహుమతి మీకు'

ఏటూరునాగారం: మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న అజ్ఞాత వ్యక్తుల వివరాల సమాచారం మాకు ఇచ్చి బహుమతి మీరు పొందాలని సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మావోయిస్టుల ఫొటోలు, వివరాలను తెలుపుతూ పోస్టర్లను అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామీణ అటవీ ప్రాంతాల్లోని ప్రజలు మావోయిస్టులకు సహకరించవద్దని అన్నారు. వాల్ పోస్టర్లో ఉన్న వారి గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు నేరుగా గాని ఫోన్ ద్వారా గాని సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం తెలియజేసిన వారికి పోస్టర్లో ఉన్న విధంగా నగదు బహుమతి అందిస్తామని స్పష్టం చేశారు. వారి వివరాలు గోప్యంగా ఉంటాయని భరోసా ఇచ్చారు. సమాచారాన్ని జిల్లా ఎస్పీ 87126 70100, ఏటూరు నాగారం ఏఎస్పీ 87126 70104, సీఐ ఏటూరు నాగారం 87126 70113, ఎస్సై 8712670090లకు సమాచారం ఇవ్వాలన్నారు.



పోస్టర్ అంటిస్తున్న చేస్తున్న సీఐ, ఎస్సై

వైద్యులకు ఘన సన్మానం



ములుగు: డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్యను సన్మానిస్తున్న జేఏసీ సభ్యులు

ములుగు: అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్ఓ) డాక్టర్ అల్లెం అప్పయ్యను జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఏజెన్సీ ప్రాంతంలో ఆయన ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మాదుగూరి నాగేశ్వర్‌రావు, కో కన్వీనర్లు మంకిడి రవి, అన్నవరం రవికాంత్, గుల్లగట్టు సంజీవ, నాయకులు అల్లం భాస్కర్, గుణ, తేజస్వినీ తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న వైద్యులు మధుకర్, మహేందర్, గ్నానసలను డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లవేళల అందరం అందుబాటులో ఉండాలన్నారు. అంతకుముందు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో వైద్య పర్య వేక్షకుడు కోటి రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వెంకటాపురం(ఎం): అంతర్జాతీయ డాక్టర్ డే ను పురస్కరించుకొని వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు చీర్ల శ్రీకాంత్, మహబుబ్‌పాషాలను లయన్స్‌క్లబ్ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మెరుగు రమేశ్, సెక్రటరీ చుంచు రమేశ్, సానికొమ్ము రవీందర్‌రెడ్డి, భాస్కర్ ఉన్నారు.



వెంకటాపురం(ఎం): వైద్యులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



వాజేడు: వైద్యులను సన్మానిస్తున్న సిబ్బంది

ఏడ్జర్లపల్లిలో వైద్యశిబిరం

వాజేడు: మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి గ్రామంలో సోమవారం మాత శిశు సంరక్షణ వైద్యాధికారిని గ్నానస ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. జ్వరం వస్తే తప్పనిసరిగా వైద్యశాలకు రావాలని సూచించారు. దోమ తెరలను తప్పనిసరిగా వాడాలని తెలిపారు. అనంతరం గ్రామంలో మొదటి విడత దోమల మందును సిబ్బంది పిచికారీ చేశారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సాగు భూములకు హక్కు పత్రాలివ్వాలి



ఐటీడీఏ పీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కొమురం భీమ్ ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఏటూరు నాగారం ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రకు గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ.. కొమరం భీమ్ గ్రామానికి చెందిన ఆదివాసీలు కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిని చదును చేసుకోని సాగు చేసుకుంటున్నారని అన్నారు. ఆదివాసీల భూములకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమరం భీమ్ ఆదివాసీలు తదితరులు ఉన్నారు.